
సాక్షి
అనంతపురం

గురువారం । 2 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.9°/15.2°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తగ్గుముఖం పట్టింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

దూరవిద్య ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని దూరవిద్య డిగ్రీ, పీజీ (రెగ్యులర్) ఫలితాలను వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి బుధవారం విడుదల చేశారు. బీఏ కోర్సుల్లో 47 శాతం, బీకాం 26, బీకాం (కంప్యూటర్స్) 42, ఎంఏ (హిస్టరీ) 42, ఎంఏ (పొలిటికల్ సైన్సెస్) 70, ఎంఏ (సోషియాలజీ)58.33, ఎంఏ (ఎకనామిక్స్) 100, ఎంఏ (ఇంగ్లిష్) 67, ఎంఏ (తెలుగు) 65, ఎంఏ (రూరల్ డెవలప్‌మెంట్) 52, ఎంకాం 81, ఎంబీఏ 66, బీఎల్ఐఎస్సీలో 73 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు www.skucde.com,www.skuniversity.ac.in లో చూడవచ్చు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, డాక్టర్ డి.మురళీధర్‌రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాపతి పాల్గొన్నారు.

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు నేటికి వాయిదా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు – 1, 3, 7 (ప్రణాళిక, ఆర్థిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు గురువారానికి వాయిదాపడ్డాయి. ఒకవైపు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, మరోవైపు పెళ్లిళ్లు, ఇంకోవైపు జాతర్లు ఎక్కువగా ఉండడంతో ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిపోయారు. దీంతో సమావేశాలను గురువారానికి వాయిదా వేశారు. రెండో రోజు జరిగే స్థాయీ సంఘాలు–2, 4, 5, 6(గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలతో పాటే వాయిదాపడ్డ స్థాయీ సంఘాల సమావేశాలు కూడా నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృతరాజ్ ప్రకటించారు.

'గాలికుంటు' టీకాల పంపిణీ ప్రారంభం



గాలికుంటు టీకా పంపిణీని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్

అనంతపురం అగ్రికల్చర్: ఆవులు, గేదెలు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజెస్–ఎఫ్ఎండీ) సోకకుండా ముందస్తు నివారణలో భాగంగా ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4.09 లక్షల పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రమణ్యం తెలిపారు. ఇందు కోసం డీడీలు, ఏడీలు, డాక్టర్లు, ఇతర పారా సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేశామన్నారు.

పింఛన్ పండుగ



అనంతపురంలో పెన్నోబులేసుకు వికలాంగుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రేవతి

అనంతపురం సెంట్రల్: వైఎస్సార్ పెన్షన్ కానుక జిల్లాలో పండుగలా సాగింది. మార్చి నెల పింఛన్ల పంపిణీ తొలిరోజు బుధవారం 88 శాతం నమోదైంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేశారు. అత్యధికంగా తాడిపత్రి అర్బన్‌లో 90.96 శాతం, బుక్కరాయసముద్రం 89.90, అనంతపురం అర్బన్ 89.13, నార్పల 87.84, రాయదుర్గం, పామిడి 86, పెద్దవడుగూరు 85, గార్లదిన్నె, గుంతకల్లులో 84, బ్రహ్మసముద్రం, బొమ్మనహాళ్ 71, గుమ్మఘట్ట 72, విడపనకల్లు 74.88, కుందుర్పి, శెట్టూరు 76 శాతం మందికి పింఛన్ బట్వాడా చేశారు. అత్యల్పంగా డీ.హీరేహాళ్‌లో 68.15 శాతం నమోదైంది. మొత్తం 2,76,640 మందికి పింఛన్ మంజూరు కాగా.. 2,44,213 మందికి తొలిరోజు పింఛన్ అందించినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. గురు, శుక్రవారాల్లో కూడా పింఛన్ పంపిణీ జరుగుతుందని వివరించారు.



సాధారణంగా డీప్ ఫ్రై వంటకం ఏది చేసినా.. మిగిలిన నూనెను మరోసారి వాడుకునేందుకు ప్రయత్నిస్తారు. మిగిలిన నూనెను మళ్లీ మళ్లీ మరిగించి వినియోగించడం వల్ల ఆ వంటకం విషపూరితమవుతోంది. అలాంటి ఆహారం తిన్న వారి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు కబాబ్, బజ్జీ సెంటర్లలోనూ అయిపోయేదాకా అదే నూనెను వినియోగిస్తున్నారు. ప్రజలు ఇలాంటి నూనెల వినియోగం గురించి నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇలాంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత ఉత్తమం.

మరిగి.. మరిగి.. విషమై

- నూనె పునర్వినియోగం.. హానికరం
- పదే పదే మరిగించిన నూనెలతో ప్రమాదకర జబ్బులు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో హోటళ్లలో భారీగా వినియోగం
- నూనెల్లో మోతాదుకు మించి టీపీసీ ఉన్నట్లు నిర్ధారించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం

గరిటెడు నూనె మిగిలిపోతే.. అయ్యో నూనె మిగిలిందే అని గృహిణులు దాన్ని నిల్వ చేసుకుని.. మరోసారి వాడుతుంటారు. ఇక హోటళ్లలో అయితే మిగిలిన నూనెను మరిగించి మరిగించి చివరి చుక్క అయిపోయే వరకూ వదలరు. మరిగించిన నూనెలు విషం కంటే ప్రమాదమనే విషయంపై అవగాహన లేక వినియోగిస్తున్నారు. దీంతో ప్రమాదకర జబ్బులతో చెట్టంత మనుషులు పిట్టల్లా కూలిపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెజారిటీ హోటళ్లలో జరుగుతున్న ఈ తంతు వేలాదిమంది ప్రాణాలకు ముప్పు తెస్తోంది.

టీపీసీ మోతాదుకు మించి

టీపీసీ గురించి చాలామందికి తెలియక పోవచ్చు. దీన్నే టోటల్ పోలార్ కాంపౌండ్స్ అంటారు. ఆహారంలో వాడే నూనెలను పదే పదే మరిగించి వాడటం వల్ల టీపీసీ మోతాదు పెరుగుతుంది. వీటి మోతాదు నూనెల్లో 25 మించి ఉండకూడదు. అంతకుమించి ఉంటే నూనెల్లో టాక్సిన్స్ (విషపదార్థాలు) విడుదల అవుతాయి. ఇటీవల అనంతపురంతో పాటు కొన్ని అర్బన్ ప్రాంతాల్లో ఈ నూనెలను పరిశీలించగా టీపీసీ మోతాదు 35 నుంచి 40 వరకూ ఉన్నట్టు తేలింది. తినే పదార్థాలు రుచికరంగా ఉండొచ్చుగానీ కానీ విషపదార్థాలు శరీరంలో గుట్టలుగా పేరుకుపోతాయన్న విషయం చాలా మందికి తెలియదు.

40 హోటళ్లలో నూనెలకు డబ్బాలు

ఒకసారి వాడిన నూనెను మళ్లీ వాడకుండా.. మిగిలిన నూనెను కొనుక్కునేందుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. ఈ నూనె కోసం తొలుత 40 హోటళ్లలో డబ్బాలు ఏర్పాటు చేస్తున్నారు. లీటర్ రూ.30 చొప్పున కొంటారు. సేకరించిన ఆ నూనెలను బయోడీజిల్‌గా వాడుకుంటారు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా విస్తరించి డబ్బాలు పెట్టి సేకరిస్తారు. దీనివల్ల ఆరోగ్యానికి హానిచేసే నూనెలను నియంత్రించడం చేయొచ్చు.

టీపీసీ మోతాదు మించితే వచ్చే ప్రమాదకర జబ్బులు

- తిన్న ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం
- గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ
- హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం
- గ్యాస్ట్రిక్ డిజార్డర్స్ ఎక్కువగా సోకి పేగులకు దెబ్బ పడుతుంది
- కాలేయ సంబంధిత వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ
- 120 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ మోతాదులో వేడి అయ్యే బంగాళాదుంప చిప్స్ వల్ల ఎక్కువ ప్రమాదం ఉంటుంది
- టీపీసీ వల్ల నూనెలు ట్రైగ్లిజరాయిడ్స్‌గా మారి శరీరానికి హాని చేసే అవకాశం ఉంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హోటళ్లు **700** పైనే

రోజుకు వినియోగమవుతున్న నూనెలు **18,000** లీటర్లు

రోజూ సగటున హోటళ్లలో తింటున్న వారు **1,00,000** మంది


పదే పదే నూనెలు మరిగిస్తూ వాడుతున్న హోటళ్లు **40** శాతం

నూనెలపై విస్తృత ప్రచారం

"ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల టీపీసీ మోతాదుకు మించి వచ్చినట్టు పరిశీలనలో తేలింది. ఈ నూనెలను కొనుక్కునేందుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. 40 హోటళ్లలో డబ్బాలు పెడుతున్నాం. అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. హోటల్ యాజమాన్యాలు సహకరించాలి. పదే పదే నూనెలు వినియోగించకూడదని చెబుతున్నాం.

– చక్రవర్తి, ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కమిషనర్

అనంతపురం ఇక రెండు మండలాలు



అనంతపురం అర్బన్: పాలనా సౌలభ్యం కోసం అనంతపురాన్ని రెండు (రూరల్, అర్బన్) మండలాలుగా వేరు చేశారు. వాటి పరిధిలోకి వచ్చే ప్రాంతాలతో రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ (రాజపత్రం)ను బుధవారం జారీ చేసింది. అర్బన్ పరిధిలో 5 లక్షల వరకు జనాభా ఉంది. రూరల్ పరిధిలో 2 లక్షలకు పైగా జనాభా ఉంది. ప్రజలకు ప్రభుత్వసేవల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అనంతపురాన్ని రెండు మండలాలుగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు అనంత కృషి ఫలించింది. ప్రభుత్వం అనంతపురాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అర్బన్ మండల పరిధిలో...: అనంతపురం నగరపాలక సంస్థ (74 వార్డు సచివాలయాలతో కూడిన 28 రెవెన్యూ వార్డులు), ఎ.నారాయణపురం, అనంతపురం గ్రామం, కక్కలపల్లిలో కొంత భాగం, రుద్రంపేట పంచాయతీ, పాపంపేటలో కొంత భాగం వస్తాయి.

రూరల్ మండల పరిధిలోకి.. : కొడిమి, తాటిచర్ల, సోములదొడ్డి, రాచానపల్లి, సజ్జలకాలవ, కురుగుంట, గొల్లపల్లి, కామారుపల్లి, ఆలమూరు, కాటిగానికాలవ, పాపంపేటలో కొంత భాగం, ఉప్పరపల్లి, ఇటుకలపల్లి, జంగాలపల్లి, కందుకూరు, చియ్యేడు, మన్నీల, కక్కలపల్లిలో కొంత భాగం (కక్కలపల్లి గ్రామం, కక్కలపల్లి కాలనీ) వస్తాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

- ఈ ఎన్నికలు సెమీఫైనల్‌లాంటివి
- ప్రభుత్వ మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ శ్రేణులకు మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా తదితరులు

అనంతపురం క్రైం: జగనన్న ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలిపించుకుందామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సాయినగర్ యాపిల్ గార్డెన్స్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలను సెమీ ఫైనల్ ఎన్నికలుగా భావించి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. గృహసారథులు ప్రతి ఓటరునూ గుర్తించి, ప్రభుత్వం చేసిన మేలును తెలియజేయాలన్నారు. పట్టభద్రుల బ్యాలెట్‌లో మూడో సంఖ్యలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్‌లో 11 సంఖ్యలో ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ఓటర్లను అభ్యర్థించాలన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రానున్న సాధారణ ఎన్నికలపై ప్రభావం చూపుతాయన్నారు. బూత్‌స్థాయి సభ్యులు ప్రతి ఓటరునూ కలిసి, ప్రభుత్వ కార్యక్రమాలు వివరించి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గతంలో జెడ్పీ ప్రతిపక్ష నేతగా సమర్థవంతంగా పని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి ఉపాధ్యాయ వర్గాల మద్దతు ఉందన్నారు. సీఎం జగన్ ఒకే నోటిఫికేషన్‌తో సచివాలయాల్లో 1,36,000 పోస్టుల భర్తీ, ఆరోగ్య శాఖలో 40 వేలు, పోలీసు, న్యాయశాఖలోనూ పోస్టుల భర్తీ చేశారన్నారు. ముఖ్యంగా డీఎస్సీ 98 క్వాలిఫైడ్‌లకు ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని ఓటర్లకు తెలియజేయాలన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ నిరాటంకంగా సంక్షేమం కొనసాగించిన విషయాన్ని వివరించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా క్రిమినల్ కావాలో.. లేదా తనలాంటి లాయర్ కావాలో ఓటర్లు ఆలోచించేలా చైతన్యం తేవాలన్నారు. టీడీపీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిపై ఆరు క్రిమినల్ కేసులున్న విషయాన్ని తెలియజేయాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులదేనన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసేలా ఓటర్లకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్‌పర్సన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతా సోమశేఖర్‌రెడ్డి, చింతకుంట మధు, లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, శ్రీదేవితో పాటు మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ అహ్మద్, నాయకులు రమేష్‌గౌడ్, అనిల్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



హాజరైన గృహసారథులు, బూత్‌కమిటీ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు

అభ్యర్థులకు స్థానాల కేటాయింపు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 49 మంది
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 12 మంది

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ పదవులకు ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు బ్యాలెట్‌లో క్రమ సంఖ్య (స్థానం)ను ఎన్నికల సంఘం కేటాయించింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పట్టభద్ర ఎమ్మెల్సీకి సంబంధించి మొదటిగా గుర్తింపుపొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అభ్యర్థులు, తర్వాత రిజిష్టర్డ్ జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీ అభ్యర్థులు, చివరగా స్వతంత్ర అభ్యర్థులకు క్రమ సంఖ్యను కేటాయించారు. అభ్యర్థుల పేరులోని మొదటి ఆంగ్ల అక్షరాన్ని (ఆల్ఫాబెటికల్) తీసుకుని స్థానాలు కేటాయించారు. ఈ క్రమంలో పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో తొలిస్థానం భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి (టీడీపీ), రెండో స్థానం రాఘవేంద్ర నగురూరు (బీజేపీ), మూడో స్థానం వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), నాలుగో స్థానం ఎస్.మల్లికార్జున (అఖిల భారత కిసాన్ జనతాపార్టీ)కు వచ్చింది. స్వతంత్ర అభ్యర్థులకు ఐదో స్థానం నుంచి 49వ స్థానం వరకు వారి పేరులోని తొలి అక్షరం ప్రకారం స్థానాలు కేటాయించారు.

- ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న 12 మందీ స్వతంత్ర అభ్యర్థులు కావడంతో బ్యాలెట్‌లో వారికి వరుసగా 12 క్రమసంఖ్యలు కేటాయించారు.

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
కర్నూలు	42,040	19,592	1	61,633
నంద్యాల	38,695	16,230	4	54,929
అనంతపురం	45,659	22,672	10	68,341
శ్రీ సత్యసాయి	29,686	13,620	4	43,310
వైఎస్సార్	52,246	29,063	8	81,317
అన్నమయ్య	14,014	6,574	6	20,594
మొత్తం	2,22,340	1,07,751	33	3,30,124

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
కర్నూలు	2,989	2,402	0	5,391
నంద్యాల	2,806	1,619	1	4,426
అనంతపురం	3,459	2,104	1	5,564
శ్రీ సత్యసాయి	2,277	1,071	0	3,348
వైఎస్సార్	4,390	3,071	0	7,461
అన్నమయ్య	1,326	632	0	1,958
మొత్తం	17,247	10,899	2	28,148

జిల్లాలో 117 పోలింగ్ కేంద్రాలు

పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అనంతపురం జిల్లాలో మొత్తం 117 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పట్టభద్రుల నియోజకవర్గానికి 84, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 33 కేంద్రాలు కేటాయించారు. ఒక్కొక్క కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు, ఒక జూనియర్ పోలింగ్ అధికారి మొత్తం ఐదుగురు సిబ్బంది ఉంటారు. ఈ ప్రకారం 117 కేంద్రాలకు 585 మంది సిబ్బందిని నియమించారు. అదే విధంగా 16 మంది సెక్టార్ అధికారులు, 16 మంది రూట్ అధికారులను నియమించారు. పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

విధుల్లోకి కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం విధులకు హాజరయ్యారు. వ్యక్తిగత పనులపై గత నెల 14 నుంచి 28 వరకు సెలవుపై వెళ్లిన విషయం విదితమే. కలెక్టర్ సెలవులో ఉండడంతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వ్యవహరించారు. సెలవు ముగించుకుని విధులకు హాజరైనందున కలెక్టర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు.

శంభో శంకర..



అశేష భక్తజనం నడుమ సాగుతున్న చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం (ఇన్‌సెట్‌లో) ఉత్సవ విగ్రహాన్ని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తున్న గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి

ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి, చౌకీమఠం పీఠాధిపతి కల్యాణస్వామి, దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ అధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని రథంపైకి చేర్చారు. శంఖునాదాలు, దప్పు వాయిద్యాల నడుమ గవిమఠ ఆస్థాన గజలక్ష్మి (ఏనుగు) రథం ముందు నడవగా చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈశ్వరా.. పరమేశ్వర.. శంభోశంకర అంటూ భక్తజనం ప్రణమిల్లగా రథ చక్రాలు ముందుకు కదిలాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి తరలివచ్చిన భక్తులతో ఉరవకొండ ప్రాంతం కిటకిటలాడింది.

– ఉరవకొండ

క్లుప్తంగా

పశువులకు టీకాలు వేయించండి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ సూచించారు. ఉరవకొండ మండలం ఆమిద్యాల, వి.కొత్తకోట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఉచిత టీకాల శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నాలుగు నెలల వయసు దాటిన ప్రతి పశువుకూ టీకా వేయించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ ఉచిత టీకాల ప్రక్రియ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులకు రిమాండ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వివాహితను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకర రెడ్డి తెలిపిన మేరకు.. నగరంలోని నవోదయ కాలనీకి చెందిన నాగలక్ష్మికి అదే ప్రాంతానికి చెందిన తిరుపాల్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె ఉంది. అదనపు కట్నం కోసం నాగలక్ష్మి (24)ని భర్త తిరుపాల్, అతని తల్లి నారాయణమ్మ, ఆడపడచు రాములమ్మ తరచూ వేధించేవారు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినా వారిలో మార్పు రాలేదు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపం చెందిన నాగమణి మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు విచారణ అనంతరం పక్కా ఆధారాలతో తిరుపాల్, నారాయణమ్మ, రాములమ్మను బుధవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

• బాబోయ్.. ఇదెక్కడి నిర్వహణ?



నిర్వహణ లోపం కారణంగా జాతీయ రహదారి స్వరూపం మారిపోయింది. రోడ్డుకు ఇరువైపులా, డివైడర్లపై పచ్చదనం కనుమరుగైంది. గతంలో నాటిన మొక్కలకు నీరు పోయకపోవడంతో నిట్టనిలువునా ఎండిపోయాయి. ఎండిన గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో ఎక్కడికక్కడ మొక్కలు తగులబడిపోయాయి. రాప్తాడు మండలం రామినేపల్లి నుంచి గుత్తి వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి నిర్వహణ పేరుతో ఎక్కడికక్కడ టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి రుసుం దండుకుంటున్న నిర్వాహకులు ఇప్పటికైనా స్పందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం







ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ అంశంపై సీఈఓ బుధవారం తన కార్యాలయం నుంచి ఎన్నికల ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున బ్యాలెట్ పేపర్ పరిమాణం విషయమై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని, ఒకట్రెండు రోజుల్లో అక్కడి నుంచి అనుమతి వస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్లకు అనుగుణంగా బాక్సులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ న్యూస్ పేపర్‌తో ఒక డమ్మీ బ్యాలెట్ పత్రం సిద్ధం చేస్తామన్నారు. అది బ్యాలెట్ ఏ విధంగా మడతపెడితే పెట్టె(బాక్సు)లో పడుతుందనేది పరిశీలిస్తామన్నారు. బ్యాలెట్ పేపర్ మడత పెట్టడంపై పోలింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఈఓ సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ ఫక్కీరప్ప

8లోగా ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి

ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ ఎనిమిదో తేదీలోగా పూర్తి చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి సీఈఓకు తెలిపారు. పోలింగ్ నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో 45 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. వీటి వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి ఈ నెల 11న శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ ఫక్కీరప్ప, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న డబ్బు తిరిగి అందజేత

బత్తలపల్లి: కొండకమర్లకు చెందిన శివమ్మ మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో గల బంధువుల ఇంటికి రెండు రోజుల క్రితం వచ్చింది. బుధవారం తిరుగు ప్రయాణంలో తన సోదరితో కలిసి ఆటోలో బత్తలపల్లికి వచ్చింది. ఆ సమయంలో తన వద్దనున్న పర్సును పోగొట్టుకుంది. అందులో రూ.8 వేలు ఉండడంతో ఆందోళన చెందింది. వెంటనే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆంజనేయులు, మన్సూరు ఇలాహీ, సుదర్శన్‌నాయుడు వెంటనే ఆటో దిగిన ప్రదేశంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని విచారించారు. బత్తలపల్లికి చెందిన ఎరుకల గంగమ్మకు పర్సు దొరికినట్లు నిర్ధారించుకున్నారు. వెంటనే గంగమ్మ ఇంటి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. దీంతో ఆమె పర్సును, నగదును అందజేశారు. వాటిని బాధిత మహిళకు నిమిషాల వ్యవధిలోనే అందజేయడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత మహిళలకు నగదు గల పర్సును అందజేస్తున్న పోలీసులు

రేపటి నుంచి లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలు

చిలమత్తూరు: మండల కేంద్రంలో వెలసిన కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. 3న అంకురార్పణ, 4న మోహినీ ఉత్సవం, 5న హనుమంత వాహనం, 6న శ్రీవారి కల్యాణం,7న బ్రహ్మరథోత్సవం, 8న ముత్యాల పల్లకీ ఉత్సవం, 9న ధ్వజావరోహణం, ఉయ్యాలోత్సవం, 10న పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



శ్రీవారి రథానికి మరమ్మతు చేస్తున్న దృశ్యం

యువకుడి బలవన్మరణం

రొద్దం: మండలంలోని ఆర్‌ఎల్ కొత్తూరు గ్రామానికి చెందిన వడ్డే వెంకటరమణ చిన్న కుమారుడు సంతోష్(22) బుధవారం సాయంత్రం ఇంట్లో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. కాగా, యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రాణం తీసిన ఈత సరదా

పీలేరు రూరల్ : సరదాగా ఈతకెళ్లి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. బుక్కపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన టి.నల్లప్ప కుమారుడు రఘునాథ (16) పీలేరులోని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ట్రిపుల్‌–ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం స్నేహితులతో కలసి ఈత కొట్టడానికి వెళ్లిన రఘునాథ్ నీటిలో దిగిన తర్వాత గల్లంతయ్యాడు. దీంతో సమాచారం అందుకున్న హాస్టల్ వార్డెన్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు.

పావురాల కోసమే తన్నుకున్నారు!

కళ్యాణదుర్గం: పావురాల కోసం బుధవారం రాత్రి బంధువుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు...కొత్తూరు గ్రామానికి చెందిన బోయ వెంకటేశులు, గోవిందు, రామకృష్ణ అదే గ్రామానికి చెందిన శివప్ప, హేమంత్, భూపతి బంధువులు. ఇరు కుటుంబాలలో పావురాలు పెంచుకుంటున్నారు. ఇటీవల పావురాలు తారుమారు కావడంతో రోజూ అడ్డపేర్లు పెట్టుకుని తిట్టుకునేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి వాగ్వాదం చోటు చేసుకుని కొట్టుకున్నారు. దీంతో ఓ వర్గంలోని బోయ వెంకటేశులు, గోవిందు, రామకృష్ణ, మరో వర్గంలోని భూపతికి గాయాలయ్యాయి. ఇరువురూ కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

• పౌరసరఫరాల సంస్థ డీఎం నీలమయ్య



మాట్లాడుతున్న డీఎం నీలమయ్య

తాడిపత్రి/ పెద్దవడుగూరు : రైతులు పండించిన జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ (డీఎం) నీలమయ్య తెలిపారు. బుధవారం ఆయన తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం, పెద్దవడుగూరు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది, రైతులతో జొన్నల కొనుగోళ్లపై ఆయన సమావేశం నిర్వహించారు. డీఎం నీలమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జొన్నలకు మద్దతు ధర క్వింటా రూ.2,970గా నిర్ణయించినట్లు చెప్పారు. జొన్నల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ–క్రాప్ చేయించుకున్న రైతులు జొన్నలు విక్రయించేందుకు ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దళారులకు జొన్నలు అమ్మి మోసపోవద్దన్నారు. తాడిపత్రి సమావేశంలో ఎంపీడీఓ రంగారావు, సీఎస్‌డీటీ రాజారాం, కో ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ నాగరాజు, వ్యవసాయ అధికారి మహితా కిరణ్, పెద్దవడుగూరులో తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏఓ మల్లీశ్వరి, ఏఈఓ రజిని పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన కల్పించండి

• అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

అనంతపురం సిటీ: సాధారణ ఎన్నికలకు, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో చాలా వ్యత్యాసం ఉంటుందని, ఈ అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించాలంటూ వివిధ శాఖల అధికారులకు అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ సూచించారు. 'ఎన్నికల విధులు – కార్యాచరణ అమలు'పై జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎమ్మెల్సీ బరిలో నిలిచిన అభ్యర్థుల పేర్లకు ఎదురుగా ఉండే బాక్సుల్లో 1, 2, 3 ఇలా ప్రాధాన్య క్రమంలో ఓటర్లు నంబర్లు వేయాల్సి ఉంటుందన్నారు. రోమన్ అంకెలోనైనా నమోదు చేయవచ్చునన్నారు. ఈ రెండు విధానాలు కాకుండా స్వస్తిక్ గుర్తు వేసినా, తప్పు.. ఒప్పు గుర్తులేసిన ఓట్లు చెల్లవని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఓటర్లను చైతన్య పరచాలన్నారు. అనంతరం పలు అంశాలపై డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవీంద్ర ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

ఈఎస్‌ఐ గ్రీవెన్స్‌కు 17 వినతులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్‌ఐసీ) 72వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 17 వినతులు అందాయి. కార్యక్రమంలో ఈఎస్‌ఐ అనంతపురం బ్రాంచ్ మేనేజర్ కిషోర్‌బాబు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బాలికల హాకీ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామం వేదికగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల హాకీ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును బుధవారం ప్రకటించారు. జట్టులో లక్ష్మి, స్వీటి, భానుతేజ, సాయిభవ్య, భావన, మంజూష, మనోజ్ఞ, యమున, మీరాన్‌బీ, మల్లిక, షాలిని, మైథిలి, హైందవి, విష్ణుప్రియ, సౌమ్య, సోనియా, శృతి చోటు దక్కించుకోగా, కోచ్‌గా దేవకి, మల్లేశ్వరి వ్యవహరించనున్నారు. కాగా, టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ హాజరు కానున్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

కళ్యాణదుర్గం: జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ బాలుర జిల్లా జట్టును స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పుండరీకాక్ష, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శివశంకర్, త్రోబాల్ సెక్రటరీ రవి, పీడీలు మురళి, తిమ్మరాజు, కుళ్లాయిస్వామి, సెలక్షన్ కమిటీ సభ్యులు అశోక్, మురళీకృష్ణ పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 4, 5వ తేదీల్లో కర్నూలు వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిథ్యం వహించనున్నారు.

రిమాండ్‌కు విలేకరి

కనగానపల్లి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కనగానపల్లి ఆంధ్రజ్యోతి విలేకరి ఆంజినేయులును పోక్సో చట్టం కింద పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కనగానపల్లి ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం స్వాగత తోరణం



కొలువు దీరిన శ్రీవారు (ఫైల్)

• అంకురార్పణ చేయనున్న అర్చకులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం(2వ తేదీన)ఆలయ ప్రాంగణంలో అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు కోరుతూ సూర్యుడు అస్తమించిన తర్వాత అంకురార్పణ చేస్తారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే సకల దేవతలను ఆహ్వానిస్తారు.

నవధాన్యాలతో మొలక

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక(కొత్తకుండ)లను మట్టితో నింపుతారు. చంద్రున్ని ప్రార్థిస్తూ అర్చక బృందం అందులో నీరు పోసి నవధాన్యాలు చల్లుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం చేస్తారు. అనంతరం అర్చకులు సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చక పండితులు రోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోసి నారు పెరిగేలా చూస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు స్వాగతం పలికేందుకు పట్టణం నలుమూలలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

ఫెన్సింగ్ కోచ్ వేధింపులపై విచారణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్రీడాకారులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలోని ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రవీంద్రనాథ్ తీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు బుధవారం తెలిపారు. విచారణాధికారిగా శ్రీసత్యసాయి జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. కాగా, జిల్లా క్రీడాప్రాధికార సంస్థలోని ఇండోర్ స్టేడియంలో ఉన్న ఫెన్సింగ్ శిక్షణ కేంద్రంలో డీఎస్‌ఏ తరఫున ప్రతాప్, ఖేలో ఇండియా తరఫున రవీంద్రనాథ్ కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తన వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా కోచ్ రవీంద్ర నాథ్ వ్యవహరిస్తున్నాడంటూ ఇటీవల పలువురు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లిన సమయంలో ప్రత్యర్థి చేతిలో ఓడిపోవాలని లేకపోతే క్రీడల్లో భవిష్యత్తు లేకుండా చేస్తానని బెదిరించేవాడని ఆరోపించారు. జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొనకుండా మాటలతో ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వ్యవహరించాడంటూ క్రీడాకారుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో పలువురు ఫిర్యాదు చేయడంతో రవీంద్రనాథ్‌పై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మృతదేహం వెలికితీత



భక్తర్‌వలి (ఫైల్)

పెనుకొండ రూరల్: చేపల వేట కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం పోలీసులు వెలికి తీశారు. పెనుకొండలోని కుమ్మరదొడ్డికి చెందిన భక్తర్‌వలి (42) గత సోమవారం బాబయ్య స్వామి చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. రెండు రోజుల గాలింపు చర్యల అనంతరం బుధవారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో పోలీసులు వెలికి తీశారు. మృతుడి భార్య ఆయేషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం

లేపాక్షి: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన కేశవప్ప (54), మరో ముగ్గురితో కలసి బుధవారం ఉదయం స్థానిక జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంతలో చేపలు పట్టారు. వీటిని రోడ్డు పక్కన ఉంచుకుని శుభ్రం చేస్తుండగా కేశవప్పను వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ఉడాయించడంతో చోళసముద్రం నివాసి ఎస్.మూర్తి ద్విచక్రవాహనంపై వెంబడించాడు. దీంతో బొలెరో డ్రైవర్ తన వాహనంతో ఢీకొనేందుకు ప్రయత్నించాడు. తప్పించుకునే క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి గాయపడిన మూర్తిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం



పూజలందుకున్న దత్తాత్రేయుడు

అనంతపురం కల్చరల్: నగరంలో వెలసిన అనఘాదేవి సమేత శ్రీజ్ఞానసాగర దత్తాత్రేయ మందిరం 35వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తుల సందడి ప్రారంభమైంది. ప్రధాన అర్చకులు అభిషేక, అలంకార సేవలు, కవచాలంకారం నిర్వహించారు. శ్రీదత్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తునన జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రరెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ బుధవారం ప్రచారం నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ జిల్లా కార్యాలయంలో ఆ శాఖ సూపరింటెండెంట్ యమ్మాని భాగ్యరాజ్, ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇతర ఉద్యోగులను కలిసి ఆమె ఓట్లు అడిగారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ సంచార పశువైద్యశాల డాక్టర్‌గా సునీత బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. పశుశాఖ ఏడీ డాక్టర్ సురేష్, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

చట్టాలపై అవగాహన

ఆత్మకూరు: మహిళా చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల వైద్యాధికారి దయాకర్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో ఫాగింగ్



సప్తగిరి సర్కిల్‌లో..

దోమలపై దండయాత్ర

నగరపాలక సంస్థ అధికారులు దోమకాటు నివారణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం రాత్రి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు సైతం దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమతెరలు వాడడంతో పాటు వారంలో ఒక రోజు స్వచ్ఛందంగా డ్రైడే పాటించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఆంజనేయులును కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు

కనగానపల్లి: ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆంధ్రజ్యోతి విలేకరి ఆంజనేయులును కఠినంగా శిక్షించాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు కనగానపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. గౌరవ ప్రదమైన విలేకరి వృత్తిలో ఉంటూ ఇటువంటి సంఘటనకు పాల్పడటం దారుణమన్నారు. పోలీసులు వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకుని సరైన శిక్ష విధించాలన్నారు. ఇటువంటి వారిని ప్రోత్సహిస్తూ నిందితులకు అండగా నిలుస్తున్న పరిటాల కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ రాజేశ్వరీ, అంకె అశోక్, బి.రవి, అనిల్, నారాయణరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసులు, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఓటు వినియోగంపై అవగాహన రేపు

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై ఈ నెల 3,6 తేదీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కే భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థలో బూత్ లెవెల్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రామ్‌నగర్ ఆర్‌డీఎంఏ కార్యాలయ సమావేశం హాలు, నగరపాలక సంస్థ, కస్తూరిబా, శారద, రాజేంద్ర మునిసిపల్ స్కూళ్లలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మలహోబిలేశుడి ఉత్సవాలు ప్రారంభం



ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత మండలంలోని వై.కొత్తపల్లిలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో గ్రామోత్సవంగా పంపనూరు కొండపైకి తీసుకువచ్చారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

కష్టపడి చదవండి



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

రాప్తాడురూరల్: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా అమలు చేస్తున్న నైట్‌విజన్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం బుధవారం రాత్రి అనంతపురం నగరంలోని మూడోరోడ్డులో ఉన్న బీసీ నంబర్–2 హాస్టల్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారా అంటూ అడిగారు. పరీక్షలు సమీపిస్తున్నాయని ఈ కొద్దిరోజులు కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బైజూస్ ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థులు వినియోగిస్తున్న ట్యాబ్‌లను పరిశీలించారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్, పొట్టి శ్రీరాములు మునిసిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తదితరులు ఉన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌కు షోకాజ్

రాప్తాడురూరల్: గార్లదిన్నె మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచరు కులశేఖర్‌రెడ్డికి విద్యాశాఖ అధికారి సాయిరాం బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు రావడంతో షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు. ఎన్నికల ప్రచారాల్లో ఉపాధ్యాయులు పాల్గొంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఇంటింటికీ వెళ్లి.. సంతోషం పంచి



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల వ్యాప్తంగా బుధవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా పింఛన్ సొమ్ము అందజేస్తున్నారా లేదా అని ఎంపీడీఓ సాల్మన్ క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మాధవి, ఏపీఓ రామకృష్ణ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా బుధవారం పండుగలా పింఛన్లను పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో సర్పంచులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల కేంద్రంలో ఎంపీపీ హేమలత వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేసి సంతోషం పంచారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అనంతపురం క్రైం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. మూమెంట్ ఫర్ పీస్, జస్టిస్ ఆధ్వర్యంలో సంబంధిత పోస్టర్లను మేయర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. యువతలో చైతన్యం తీసుకురావడానికి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యంపీజే జిలా అధ్యక్షుడు సులేమాన్‌షరీఫ్, సిరాజ్ అహ్మద్, ఐజేఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజీపీరా, ఫిరోజ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లాయర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: లాయర్ శివప్రసాద్‌పై దాడి చేసిన కేసులో కిషోర్ అనే నిందితున్ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శివరాముడు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే రోజా, ఆమె తండ్రిని రిమాండ్‌కు పంపామన్నారు. కేసులో పరారీలో ఉన్న కిషోర్‌ను కూడా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

'వాల్మీకి రామాయణం..' పుస్తకావిష్కరణ

రాప్తాడురూరల్: అనంతపురం నగరానికి చెందిన డాక్టర్ పి. దామోదర్‌రెడ్డి రచించిన 'వాల్మీకి రామాయణం–చారిత్రక దృక్కోణం' అనే పుస్తకాన్ని బుధవారం గుడివాడలోని ప్రణవ ఆశ్రమంలో ఏపీ శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. కస్తూరి విజయం అనే సంస్థ తరఫున పామిరెడ్డి సుధీర్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ప్రచురించారు. దామోదర్ రెడ్డిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం



ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

అనంతపురం సప్తగిరి సర్కిల్: కోవిడ్ సమయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాల్‌లో ఎన్‌ఎస్‌ఎస్ సీనియర్ వలంటీర్ల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ సమాజాన్ని, వాతావరణాన్ని పరిరక్షించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అందించే ఎన్‌ఎస్‌ఎస్ ప్రశంసాపత్రాన్ని అందించారు. అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.